గద్దర్ వ్యక్తి కాదు.. సమూహ శక్తి

ఆయనను విమర్శిస్తే సహించేది లేదు : టీయూజేఏసీ

చిక్కడపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గద్దర్ ఒక వ్యక్తి కాదు సమూహశక్తి అని ఆయనను విమర్శిస్తే సహించేది లేదని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్‌యాదగిరి, ప్రధాన కార్యదర్శి తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డిలు అన్నారు. బుధవారం చిక్కడపల్లి తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో గద్దర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుల్తాన్ యాదగిరి, ప్రఫుల్ రాంరెడ్డి మాట్లాడుతూ సంగ్రామభేరి, వేలాది ప్రజలను మేల్కొల్పిన అంబేడ్కర్ వాది, అడవి బిడ్డలు, కార్మిక, కర్షక వర్గాలు, బడుగు, బలహీనవర్గాల కోసం పోరాడిన గద్దర్ లాంటి మహనీయులకు పద్మ అవార్డు చాలా చిన్నదన్నారు. నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మనువాద సిద్ధాంతాలతో మూఢనమ్మకాలతో దేశాన్ని పాలించాలనిచూస్తున్నారని మండిపడ్డారు. దళితులను, ఆదివాసీలను అణిచివేయాలని చూస్తున్నారని అందులో భాగంగానే గద్దర్‌కు పద్మ అవార్డు తిరస్కరించారని మండిపడ్డారు. రాజ్యాంగపరిధిలో పనిచేస్తున్న తెలంగాణ రాష్ట్రప్రభుత్వం పద్మ అవార్డులు వీరికివ్వాలని తీర్మానం చేసి కొన్ని పేర్లు కేంద్రానికి పంపిస్తే దళితులను, గద్దర్, గోరటివెంకన్న, అందెశ్రీ, గిరిజనులకై జీవితం ధారబోసిన జయధీర్ తిరుమలరావులకు అవార్డులు తిరస్కరించారన్నారు. బండి సంజయ్ కేంద్రమంత్రి అయ్యాడు. ఆయన ఏ పోరాటాలూ చేయలేదని ఎవరి బతుకులు కూడా మార్చలేదని ఆయనకు ఉన్న అర్హత ఒక్క నోటి దూల మాత్రమేనని కేంద్రప్రభుత్వం వెంటనే బండి సంజయ్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు గంటి చంద్రుడు, జగన్, చంద్రన్నప్రసాద్, సురేష్‌బాబు, రాజయ్య, యాదగిరి, రాజు తదితరులు పాల్గొన్నారు.



గద్దర్‌కు నివాళులర్పిస్తున్న యాదగిరి, రాంరెడ్డి తదితరులు



గద్దర్‌కు నివాళులర్పిస్తున్న కొలకలూరి ఇనాక్ తదితరులు

గద్దర్ లలితకళల సమగ్రస్వరూపం

గద్దర్ లలితకళల సమగ్రస్వరూపం అని వెంకటేశ్వరయూనివర్శిటీ పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో బుధవారం ఎందరో మహానుభావుల మధురస్మృతుల పరంపరలో భాగంగా ప్రజా గాయకుడు గద్దర్ జయంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ఆచార్య ఇనాక్ మాట్లాడుతూ గద్దర్ పాట రాసి నాట్యం చేస్తూ పాడే తీరు శిల్పంలా ఉంటుందన్నారు. మానవీయ సంబంధాలకు ప్రాధాన్యం ఇచ్చిన ప్రేమతత్వం ఆయనలో ఉందన్నారు. తాను అనంతపురంలో కళాశాలలో ఉపన్యాసకుడిగా ఉన్న సమయంలో గద్దర్ రచనలను పాఠ్యాంశాలుగా బోధించానని గుర్తుచేశారు. అధ్యక్షత వహించిన జనార్దనమూర్తి మాట్లాడుతూ గద్దర్ గానసభకు పలుమార్లు వచ్చారని ఆయన పాటలో ఉత్తేజం పాటలో ఆప్యాయత వ్యక్తం అవుతాయన్నారు. కాంగ్రెస్ నేత ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ హృదయాన్ని తాకేలా గద్దర్ పాటరాస్తారని పాడుతారన్నారు. సంఘసేవకులు భవానిశ్రీనివాస్, సుధాకర్, ప్రభాకర్, వెంకటేష్, రామ్‌రెడ్డి మాట్లాడుతూ గద్దర్‌కు పద్మ అవార్డ్ ఇవ్వబోమని ప్రకటించడాన్ని ఖండిస్తూ మాట్లాడారు.



డిప్యూటీ డీఈవో శ్రావణ్ కుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు జయలక్ష్మి, భారతి, వెంకటేశ్వర్ తదితరులు

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

● డిప్యూటీ డీఈవో శ్రావణ్ కుమార్

ముషీరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు సులువుగా పాఠ్యాంశాలు అర్థమయ్యేలా విద్యాబోధన చేస్తూ ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ డీఈవో శ్రావణ్ కుమార్ అన్నారు. బుధవారం ముషీరాబాద్ విద్యామండలి-2 డిప్యూటీ ఐవోఎస్ జయలక్ష్మి శ్రావణ్ కుమార్‌ను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్, నవనీత తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విజయేందర్, ఎలిగేటి మహేష్ తదితరులు

కొత్త ఫ్లైఓవర్‌కు పుంజాల శివశంకర్ పేరు పెట్టాలి

కవాడిగూడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కొత్తగా ప్రారంభించబోయే ఫ్లై ఓవర్‌కు కేంద్ర మాజీ మంత్రి, మాజీ గవర్నర్ శివశంకర్ పేరు పెట్టాలని రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌ను రాసూరి విజయేందర్, కంపాటి రవికుమార్, చిట్యాల సంతోష్‌కుమార్, ఎలిగేటి మహేష్‌లు బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా గవర్నర్‌గా, న్యాయవాదిగా పుంజాల శివశంకర్ దేశానికి కాంగ్రెస్ పార్టీకి విశిష్ట సేవలు అందించారని ఆయన సేవలను గుర్తుంచుకొని ఆయను పేరును తెలంగాణలో నూతనంగా ప్రారంభించబోయే ఫ్లై ఓవర్‌కు పేరు పెట్టాలని వారు మంత్రిని కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి మాట్లాడుతూ ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి శివశంకర్ పేరును పెట్టేవిధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

జంధ్యాల తెలుగు సినీ పరిశ్రమకు దక్కిన గొప్ప వరం

చిక్కడపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కళానిలయం ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో బుధవారం ప్రఖ్యాత దర్శకులు జంధ్యాల జయంతి వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న మధుసూదనాచారి మాట్లాడుతూ ఒకనాటి సినిమాల్లో కథ, నటన, సందేశం ఉండేవన్నారు. జంధ్యాల అసభ్యత లేని హాస్య చిత్రాలు రూపొందించారన్నారు. ఈ సందర్భంగా జంధ్యాల సినిమాల్లో నటించిన శంకర్ మేల్కోటే, వై శంకర్, జెన్నీలను సత్కరించారు. మేల్కోటే మాట్లాడుతూ జంధ్యాల తెలుగు సినీ పరిశ్రమకు దక్కిన గొప్ప వరం అన్నారు. గాయని హైమవతి బీమన్న అధ్యక్షత వహించిన సభలో వంశీ రామరాజు, బద్రినాథ్, దైవజ్ఞశర్మ, సంస్థ కార్యదర్శి సురేందర్, శ్రీదేవి, అనురాధ, రేవతి, బాపుశాస్త్రి, సూర్య, గోపికృష్ణ, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

చిక్కడపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పేదలకు అన్నదానం చేయడం అంటే అది దైవకార్యంతో సమానమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. చిక్కడపల్లి ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో బుధవారం చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్ కార్యాలయం గేట్ వద్ద పేదలకు అన్నదాన చేశారు. ఈ సందర్భంగా ముఠా గోపాల్ మాట్లాడుతూ పేదలకు అన్నదానంలో నిరుద్యోగ యువత, పోటీ పరీక్షల అభ్యర్థులకు కూడా భోజన సదుపాయం కల్పించడం విశేషం అన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చేపూరి లక్ష్మణ్, ప్రధానకార్యదర్శి పల్లెర్ల రమేష్, కోశాధికారి తొడుపునూరి రవీందర్, మాజీ అధ్యక్షుడు సింగారపు రమేష్, సింగారపు శంకర్, అన్నదాతలు ప్రొద్దుటూరి నరసింహారావు, జి. వెంకటసుబ్బయ్య, గంప భిక్షపతి, చేపూరి బాలకృష్ణ, సురేందర్‌గుప్త, బీఆర్‌ఎస్ నేతలు ముఠా జైసింహ, రాకేష్, పున్న సత్యనారాయణ, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్ పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి


కవాడిగూడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): లోయర్ ట్యాంక్‌బండ్‌లో హుస్సేన్ సాగర్ కట్ట కింద అక్రమంగా కొనసాగుతున్న షెడ్డును తొలగించాలని స్థానికులు బుధవారం జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లో ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు కొనసాగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికుడు లోక్‌నాథ్ డిమాండ్ చేశారు. ప్రధాన రోడ్డుపై కార్లు, ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేసి మరమ్మతులు చేయడంతో లోయర్ ట్యాంక్ బండ్ కట్టమైసమ్మ దేవాలయం నుంచి ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చేదారిలో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

ముగిసిన చెంగిచర్ల కమేళా లీజు గడువు

● కొత్త టెండర్లు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

ఉప్పల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చెంగిచర్లలోని పశు వధశాల (స్లాటర్ హౌజ్- కమేళా) లీజు గడువు ముగిసింది. ఏడాదికి ఒకసారి ఈ కమేళాను నిర్వహించేందుకు ప్రభుత్వ పశు సంవర్ధక శాఖ మేకలు గొర్రెల అభివృద్ధి సహకార సమాఖ్య సంస్థ టెండర్లు పిలుస్తుంది. అయితే గతంలో ఈ టెండర్ పొందిన మహ్మద్ సలీమ్ కంపెనీ గడువు ఈనెల 21తో ముగియడంతో ఆ గడువును 28వ తేదీ వరకూ పొడగించారు. ఆ గడువు కూడా ముగియడంతో సత్వరమే టెంటర్లు పిలువాల్సిందిగా పశుసంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్ ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 21 మేకల గొర్రెల అభివృద్ధి సహకార సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ బోర్డు మీటింగ్‌లో తీసుకున్న నిర్ణయం మేరకు మహ్మద్ సలీమ్ వెంటనే స్లాటర్ హౌజ్‌ను ఖాళీ చేయాలని ఆదేశిస్తూ కొత్త టెండర్ ప్రక్రియ చేపట్టారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



కవాడిగూడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ స్టేడియం ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని దోమలగూడ పోలీసులు బుధవారం ఉదయం స్వాధీనం చేసుకున్నారు. దోమలగూడ ఎస్‌ఐ శాంతి తెలిపిన వివరాల ప్రకారం.. దోమలగూడ పీఎస్‌పరిధిలోని ఎన్‌టీఆర్ స్టేడియం టీడీపీ కార్యాలయం సమీపంలో ఓ గుర్తు తెలియని 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతి చెందాడని సమాచారం రావడంతో దోమలగూడ పోలీసులు, క్లూస్ టీంతో సంఘటనా స్థలానికి చేరుకొని గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించినట్లు ఆమె తెలిపారు. మృతుడు సమీప ప్రాంతాల్లో భిక్షాటన చేసి జీవనంసాగించే వాడని, అతని ఆచూకీ తెలిసిన వారు వెంటనే దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించి సమాచారం అందించాలని కోరారు.

రైల్వేలో లోకో పైలట్ల సమస్యలు పరిష్కరించాలి

● ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్

రాంనగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో లోకో పైలట్ల సమస్యలు పరిష్కరించి వారి సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని పలువురు ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్), ఆలిండియ లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ (ఏఐఎల్‌ఆర్‌ఎస్‌ఏ) జోనల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ టి.హన్మయ్య, సెక్రటరీ జనరల్ కె.సి.జేమ్స్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ తదితరులు మాట్లాడారు. డియర్‌నెస్ ఆలవెన్స్ (డీఏ)లో 50 శాతం పెరుగుదల తర్వాత పెరిగిన ఇతర ఆలవెన్స్‌లకు అనుగుణంగా కిలో మీటర్ ఆలవెన్స్ (ఏఎంఏ)ను సవరించాలన్నారు. సిబ్బంది శ్రేయస్సు, ప్రజాభద్రత రెండింటినీ నిర్ధారించడానికి రాత్రి విధులను పరిమితం చేయడం తప్పనిసరి అన్నారు. లోకో పైలెట్లకు విశ్రాంతి సమయాలతో కలపకుండా 30 గంట ఆవర్తన విశ్రాంతి (పీఆర్) మంజూరు చేయాలన్నారు. లోకో రన్నింగ్ స్టాఫ్ ఖాళీలను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి బి.ఎస్.వి.రాజు, ఎస్.సి.ఆర్.వర్కింగ్ ప్రెసిడెంట్ సూర్యకుమార్, ఎస్.కుమార్, ఎస్.డి.జిలానీ పాషా, ఎం.టి.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హన్మయ్య తదితరులు



ట్రస్మా క్యాలెండర్‌ను ఆవిష్కరించిన రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, కందాల పాపిరెడ్డి

ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి

● స్పీకర్ గడ్డం ప్రసాద్

ముషీరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. బుధవారం ట్రస్మా నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రైవేటు పాఠశాలల సమస్యలను ట్రస్మా వ్యవస్థాపక అధ్యక్షులు పాపిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డిలు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్మా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, కోశాధికారి శ్రీకాంత్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి బసవరాజు, నాయకులు జయరాం ప్రసాద్, రాములు, రాజశేఖర్‌రెడ్డి తదిరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపు కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

బర్కత్‌పుర, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బాలికను లైంగికంగా వేధించిన కేసులో పోక్సో కోర్టు నిందితునికి మూడేళ్ల కఠిన కారాకార శిక్ష విధించిందని కాచిగూడ పీఎస్ సీఐ చంద్రకుమార్, ఎస్సై నరేష్ కుమారులు తెలిపారు. మలక్ పేటలో నివాసముంటున్న మహమ్మద్ జాంగీర్ కుమారుడు మహ్మద్ ఆబిద్ ఖురేషి(30) వృత్తిరీత్యా వ్యాపారం చేస్తున్నాడు. 2022 జూన్ నెలలో బర్కత్‌పురలో 13 ఏళ్ల బాలికను లైంగికంగా వేధించాడు. ఆ బాలిక ఫిర్యాదు మేరకు నాడు కాచిగూడ పోలీసులు అతనిపై పోక్సో కింద కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించిన తీర్పు బుధవారం నాంపల్లిలోని 12 వ అడిషనల్ సెషన్స్ పోక్సో జడ్జి అనిత తీర్పునిచ్చింది. నిందితుడు మమ్మద్ అబిద్ ఖురేసికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష రూ.10 వేల జరిమానా విధించినట్లు వారు తెలిపారు.

కేంద్రమంత్రి బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలి

● ఏఐవైఎఫ్ కార్యదర్శి ధర్మేంద్ర

రాంనగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి బండి సంజయ్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని ఏఐవైఎఫ్ కార్యదర్శి ధర్మేంద్ర డిమాండ్ చేశారు. గద్దర్‌పై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం హిమాయత్‌నగర్ చౌరస్తాలో బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఆయన వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, నగర జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ, నాయకులు మధు, శివకుమార్, కల్యాణ్, అనిల్‌కుమార్, హేమంత్‌కుమార్, అరుణ్, భగత్‌సింగ్, వీరేష్, భానుప్రకాష్ పాల్గొన్నారు.

గత ప్రభుత్వాల విధానాలతో కుంటుపడిన అభివృద్ధి

● టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి దశరథ్

నల్లకుంట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలు నారా చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డిలు దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో పాల్గొని లక్ష కోట్ల పెట్టుబడులను తీసుకురావడం అభినందనీయమని టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్ అన్నారు. ఏపీలో వైఎస్ జగన్ ప్రభుత్వం, తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వ హయంలో విదేశీ పెట్టుబడులను తీసుకురావడంలో పూర్తిగా వైఫల్యం చెందారని ఆయన ఆరోపించారు. బుధవారం నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలుగు యువత తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కిరణ్‌కుమార్, నాయకుడు భానుప్రకాష్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. వివిధ రకాల కంపెనీలను తీసుకురావడంతో ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లు ప్రధాన పాత్ర పోషించారని అన్నారు. ఏపీలోని మారుమూల గ్రామాలలో సహితం పలు కంపెనీలు ఏర్పాటు కానున్నాయని, ఇవి గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. రామాయణపట్నంలోని భారత్ పెట్రోలియంలో 3 వేల మందికి, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్‌లో 1945 మందికి, కర్నూలులోని ఎన్‌హెచ్‌పీఎల్‌లో 700 మందికి, టీఎస్‌లో 2,500 మందికి, హీరో ఫ్యూచర్స్‌లో 650 మందికి, కర్నూలులో 1200 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయని ఆయన పేర్కొన్నారు.



హెచ్‌యూజే డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు తదితరులు

హెచ్‌యూజేకు జర్నలిజంలో సుదీర్ఘ చరిత్ర ఉంది

● మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు

బర్కత్‌పుర, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యుజే)కు జర్నలిజంలో సుదీర్ఘ చరిత్ర ఉందని, ఎందరో సీనియర్ పాత్రికేయులు ఈ సంఘంలో కొనసాగి విశిష్ట సేవలందించారని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు కొనియాడారు. బుధవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో హెచ్‌యూజే-2025 మీడియా డైరీని హెచ్‌యూజే అధ్యక్షుడు శిగ శంకర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె.విరహత్ అలీతో కలిసి మంత్రులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, ప్రభుత్వ సలహాదారులు వేమ్ నరేందర్‌రెడ్డి, మాజీమంత్రి షబ్బీర్ ఆలీ, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, టీయూడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కె.రాములు, కార్యదర్శి వర్కాల యాదగిరి, హెచ్‌యూజే కార్యదర్శి అబ్దుల్ అమీర్ షౌకత్, ఉపాధ్యక్షులు జే.పి.చారి, లక్ష్మణ్, ఇబ్రహీం, కోశాధికారి శ్రావణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు గౌస్ మోహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలి

రాంనగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు దేశవ్యాప్తంగా రూ.10 వేల రూపాయల పెన్షన్ అమలు చేయాలని కోరుతూ కేంద్ర దివ్యాంగుల సామాజిక న్యాయ విభాగం కార్యదర్శి డాక్టర్ రాజేష్ ఆగర్వాల్‌కు దివ్యాంగుల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 20 కోట్ల మంది దివ్యాంగులు ఉన్నారని, వారందరికీ ప్రతి నెల రూ.10 వేల రూపాయల పెన్షన్ ఇచ్చే విధంగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖలోని దివ్యాంగుల భర్తీలను అమలు చేయాలన్నారు. తమ డిమాండ్లను పరిష్కరిస్తామని రాజేష్ ఆగర్వాల్ హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.



ఎస్సీ కమిషన్ సభ్యుడితో భేటీ అయిన బాధితులు

బాధితులకు నెలలో ఇళ్లు కేటాయించాలి

చిక్కడపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ స్వామివివేకానందనగర్ బస్తీలో ఏడాది కిందట రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ కూల్చివేసిన 19 ఇళ్ల నివాసులైన దళితులకు నెలరోజుల్లో ఇళ్లు కేటాయించాలని సికింద్రాబాద్ ఆర్‌డీవోను షెడ్యూల్ కులాల జాతీయ కమిషన్, సామాజిక న్యాయమంత్రిత్వశాఖ ఆదేశించినట్లు బాధితులు తెలిపారు. ఎంపీ డా. లక్ష్మణ్, గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ సహకారంతో ఢిల్లీకి వెళ్లిన బాధితులు, రాష్ట్రప్రభుత్వ అధికారుల మధ్య నేషనల్ ఎస్సీ కమిషన్ మెంబర్ వడ్డపల్లి రామ్‌చందర్ ఆధ్వర్యంలో మంగళవారం న్యూఢిల్లీలో జాతీయ ఎస్సీ కమిషన్, సామాజిక న్యాయమంత్రిత్వ శాఖ హియరింగ్ నిర్వహించిందని బస్తీ బాధితులు ఎంబి కృష్ణ, జ్ఞానేశ్వర్, ఆనంద్‌రావు ఒక ప్రకటనలో వెల్లడించారు. 65 సంవత్సరాలుగా నివసిస్తూ ప్రభుత్వానికి ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లిస్తున్న బాధితుల ఇళ్లను అక్రమంగా కూల్చేశారని వారికి నెలరోజుల్లో ఇళ్లు కేటాయించాలని నష్టపరిహారం చెల్లించాలని కమిషన్, మంత్రిత్వశాఖ ప్రతినిధులు రాష్ట్రప్రభుత్వ అధికారులను ఆదేశించారన్నారు. నిర్ణీత గడువులోపు బాధితులకు న్యాయం చేయకపోతే అధికారులపై న్యాయపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారని వారు పేర్కొన్నారు.



లోకానాథశర్మను సన్మానిస్తున్న అతిథులు

నవ్యనాటక సమితి కృషి అభినందనీయం

చిక్కడపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నవ్యనాటక సమితి కృషి అభినందనీయమని రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.వసుంధర అన్నారు. యువ, ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించి వారి ప్రతిభకు పట్టం కడుతూ 66 సంవత్సరాలుగా ఈ సంస్థ చేస్తున్న సాంస్కృతిక, కళారంగ సేవ విశిష్టమైందన్నారు. బుధవారం నవ్యనాటక సమితి వార్షిక సమావేశం చిక్కడపల్లిలోని సంస్థ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసులు డా. తాడేపల్లి లోకనాథశర్మను ఆమె సన్మానించారు. ఈ సందర్భంగా వసుంధర మాట్లాడుతూ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు వేమరాజు నరసింహారావు చిరస్మరణీయులన్నారు. ఆచార్య ఫణీంద్ర, నిష్టల సుధామాల, నందూరి విద్యారణ్యస్వామి, చలపతిశాస్త్రి, కామిశెట్టి గోదాలక్ష్మి, వి. విజయకుమార్, సుధారాణి, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు పటిష్టమైన చర్యలు

బర్కత్‌పుర, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో దోమల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. బుధవారం డివిజన్‌లోని మోతీమార్కెట్, సునార్‌గల్లీ, శ్రీహనుమాన్ ఆలయం వీధి తదితర ప్రాంతాలలో పాదయాత్ర నిర్వహించి ప్రజలెదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక ప్రజలు వీధి దీపాలు వెలగడం లేదని, పలు చోట్ల దోమల బెడదతో మలేరియా, డెంగ్యూ వ్యాధుల బారినపడుతున్నామని ఫాగింగ్ సరిగ్గా చేయడం లేదని ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడిన కార్పొరేటర్ అన్ని బస్తీలలో దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని, వీధి దీపాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు వాసు, భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, రవియాదవ్, నాగు, లావణ్య, రామకృష్ణ పాల్గొన్నారు.



మోతీమార్కెట్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తాం

● తెలంగాణ సెంట్రల్ పీఎఫ్ కమిషనర్ సత్యనారాయణ

రాంనగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తామని, పెన్షనర్ల నగదు రహితవైద్యం అందించేందుకు కృషి చేస్తామని తెలంగాణ సెంట్రల్ పీఎఫ్ కమిషనర్ ఎం.ఎస్.కె.వి.వి.సత్యనారాయణ అన్నారు. బుధవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ 30వ వార్షికోత్సవం, పెన్షనర్స్ విజన్ బుక్-2 ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పీఎఫ్ కమిషనర్ ఎం.ఎస్.కె.వి.వి.సత్యనారాయణ, ఈపీఎఫ్ సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్టీ సభ్యులు ఎస్.మల్లేశం, పీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ శివకుమార్‌లు హాజరయ్యారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.నాగేందర్, కార్యదర్శి ఆర్.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ సెంట్రల్ పీఎఫ్ కమిషనర్ సత్యనారాయణను సత్కరిస్తున్న నేతలు